క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో టెండర్, వేలం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని అన్నదానానికి బఫే ప్లేట్ల సరఫరాకు టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీల కంఠం తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో పాదరక్షలు భద్రపర్చు షాపు ఏర్పాటు చేసుకోవడానికి ప్రథమ ధరావత్తు రూ.50 వేలు చెల్లించి, రూ.3 లక్షల సాల్వెన్సీతో పాటలో పాల్గొన్నాలన్నారు. అదే విధంగా ఆలయంలో కొట్టిన కొబ్బరి కాయలో చెక్క తీసుకుపోవడానికి ప్రథమ ధరావతు రూ.లక్ష చెల్లించి, రూ.5 లక్షల సాల్వెన్సీతో పాటలో పాల్గొన్నాలన్నారు. అలాగే బఫే, పేపరు ప్లేట్ల సరఫరాకు రూ.10 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి, రూ.లక్ష సాల్వెన్సీతో పాటకు హాజరు కావాలన్నారు. రూ.వెయ్యితో టెండర్ ఫారం స్వీకరించి జనవరి 5వ తేదీ లోపు టెండర్ బ్యాక్సుల్లో వేయాలన్నారు. దేవాదాయ శాఖ నిబంధనలు వర్తిసాయని తెలిపారు.

2న వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు



వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

సామర్లకోట: వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం సందర్భంగా జనవరి 2వ తేదీన వేట్లపాలెం గ్రామంలో కొలువైన స్వామివారికి విశేష పూజలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా శనివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదానార్చకులు సురేష్‌ఆచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని చెప్పారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

సామర్లకోట: మండల పరిధిలో పనసపాడు గ్రామంలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయని, ఆక్రమ కట్టడాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన శెట్టిబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాయుడు మోజెస్ బాబు శనివారం కాకినాడలో డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. సర్వే నెంబరు 233లో బండి బాట రోడ్డు మార్గం, ప్రభుత్వ భూమిలో ఆక్రమ కట్టడాలు జరుగుతున్నాయని మోజెస్‌బాబు ఆరోపించారు. గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు శ్మశానాలు లేక పోవడంతో ఆయా కులాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ఆక్రమణలపై పూర్తి స్థాయి విచారణ చేసి ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

31న కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే మున్సిపల్ పాలక మండలి సమావేశం ఈ నెల 31వ తేది ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన 15 అంశాలను అజెండాలో పొందుపరచామని, దానిపై సభ్యులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశానికి పాలక మండలి సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పుప్పాల

సామర్లకోట: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పుప్పాల గోవిందు ఎన్నికయ్యారు. శనివారం చక్రవర్తి అపార్టుమెంట్‌లో నియోజకవర్గ కన్వీనర్ కొక్కిరిగడ్డ గంగరాజు అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా కిమిలి దుర్గాప్రసాద్ ఎన్నిక అయ్యారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీని బలోపేతం చేయాలన్నారు. నియోజకవర్గ బీజేపీ నాయకుడు గొరకపూడి చిన్నయ్యదొర, మాజీ జిల్లా అధ్యక్షుడు సుంకవిల్లి బాపిరాజు, మాజీ పట్టణ అధ్యక్షుడు పెన్నాడ జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

జయప్రకాష్ నారాయణ పర్యటన

సామర్లకోట: జిల్లా పర్యటనలో భాగంగా లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత కలెక్టర్ డాక్టర్ జయప్రకాష్ నారాయణ శనివారం స్థానిక వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి చదువుతో సమాజానికి అవసరమయ్యే సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుందని హితవు పలికారు. జంతువులు 24 గంటలలోనే స్వయంశక్తితో జీవించడానికి అలవాటు పడతాయని, మనిషి స్వయంగా జీవించడానికి కనీసం 15 ఏళ్లు అవసరమని అన్నారు. మనిషి తనకు తెలిసిన జ్ఞానాన్ని ఇతరులకు పంచాలన్నారు. కార్యక్రమంలో రచయిత, డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, కళాశాల చైర్మన్ డాక్టరు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేట్లపాలెం రామకృష్ణ సేవాసమితికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. వివేకానంద సేవాసమితి కార్యదర్శి కంటిపూడి గోపాలకృష్ణ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

పొలిమేరల్లో పొగసెగలు

- చెత్తకు నిప్పు పెట్టడంతో సమస్య
- డంప్ యార్డులను తలపిస్తున్న శివార్లు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు



దివిలి ప్రధాన రహదారిపై చెత్తకు నిప్పు పెట్టడంతో కమ్ముకున్న పొగ

పెద్దాపురం: గ్రామ పొలిమేరలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. అదొక సమస్య అయితే.. ఆ చెత్త కుప్పలు తగలబెట్టినపుడు వ్యాపించే పొగ, దుర్వాసన సమీప ప్రాంతాల వారికి మరింత చేటు చేస్తోంది. ఎక్కడ ఎవరికి ఏ రోగమొస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని ఏటిపట్ట గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి.. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో వీధుల్లో రోజు రోజుకూ చెత్త పెరిగిపోతోంది. ఊర్లో చెత్తంతా బయట ప్రాంతానికి తరలించకుండా ఎక్కడికక్కడ వదిలిపెట్టేస్తుండడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మండలంలోని దివిలి, పులిమేరు, కట్టమూరు, చంద్రమాంపల్లి, సీబీ దేవం, కాండ్రకోట ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లోనూ, వీధుల్లో రోడ్డు పక్కనే చెత్తను గుట్టలు గుట్టలుగా పోసేస్తున్నారు. దీంతో వీధులన్నీ దాదాపు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారులు వెళ్లే రోడ్డులో చెత్త కుప్పలే స్వాగతం పలుకుతున్నాయి. గ్రామీణ రహదారులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

నిప్పుతోనే ముప్పు

గ్రామాల్లోనూ, వీధుల్లోనూ రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఎదురెదురు వాహనాలు కూడా దాటుకుని వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఎక్కడ పేరుకుపోయిన చెత్తను అక్కడే కాలుస్తున్నారు. ఈ చెత్తకు నిప్పు పెట్టిన తర్వాత గంటలు, రోజుల తరబడి దహనమవుతూ చెత్త నుంచి పొగ కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పొగ వల్ల పర్యావరణం దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పొగ ఇళ్లల్లోకి వ్యాపించి, ఉక్కిరిబిక్కిరవుతున్నామని సమీప గ్రామ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

మండుటెండలో నిప్పెట్టేశారు

మండలంలోని దివిలి ప్రధాన రహదారిలో చెత్తకుప్పకు నిప్పంటించడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వీస్తున్న చలి గాలుల నేపథ్యంలో మిట్ట మధ్యాహ్నం వేళలో కూడా నిప్పంటుకున్న చెత్త కుప్ప నుంచి వస్తున్న గాలిని తట్టుకోలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని, కాలుష్యాన్ని నివారించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అధికార యంత్రాంగం స్థానిక ఎమ్మెల్యేల ఆదేశాలను పట్టించుకోని పరిస్థితి దాపురించింది. గత మండల సమావేశంలోనూ ఎమ్మెల్యే చిన రాజప్ప అధికారుల సమీక్షలో స్వయంగా దివిలి, ఉలిమేశ్వరం, సిరివాడ, కట్టమూరుతో పాటు పలు పంచాయతీల ముఖద్వారాల వద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని, మండలంలోని ఎక్కడ ఏ గ్రామంలోనూ చెత్త కుప్పలు లేకుండా చూడాలని ఆదేశించారు. అయినప్పటికీ రెండు నెలలు గడవక ముందే ఏ గ్రామంలో చూసినా పంచాయతీ ముఖ ద్వారాల వద్ద చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. దీంతో అధికార యంత్రాంగం ఏమాత్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందో అర్థమౌతూనే ఉందంటూ పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో చెత్తకుప్పలకు నిప్పు పెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతోంది. నివాస ప్రాంతాల సమీపంలో చెత్తకు నిప్పు పెట్టరాదని, గ్రామానికి దూరంగా, నిర్జన ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశిస్తాం.
– శ్రీలలిత, ఎంపీడీఓ పెద్దాపురం మండలం

ఈ స్తంభం ఎవరికి మృత్యు పాశమో!



సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట, పశువులమ్మ ఆలయం సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థితిలో ఉంది. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఈ స్తంభం దెబ్బ తిన్నట్టు గుర్తించిన స్థానికులు దానిని మార్చాలని విద్యుత్ అధికారులను కోరారు. ఆ శాఖ ఏఈ పి.రమేష్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లగా సోమవారం మారుస్తామని తెలిపారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

పెద్దాపురం: పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రేస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు కొర్నిలియస్ (యలమంచలి) అన్నారు. స్థానిక కట్టమూరు పుంతలోని కల్వరి మిరాకిల్ చర్చిలో శనివారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పేదలకు హెచ్ఐవి బాధితులు 35 మందికి వస్త్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్, క్లాప్స్ అధ్యక్షుడు లంక పురుషోత్తమ్ దాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదలను ఆదరించిడమే నిజమైన ప్రేమ అన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫాస్టర్లు జయబాబు, ప్రసాద్, సమర్పణ, మేరీ కుమారి, వైజ్ ప్రాజెక్టు అధ్యక్షులు మల్లిక, జార్జి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



స్టడీ మెటీరియల్ అందుకున్న పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

- ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులకు కాపవరం మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం అద్దంకి వెంకన్నబాబు, ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్ ఉపాధ్యాయుడు కోడూరి నాగేశ్వరరావు స్టడీ మెటీరియల్‌ను ఏర్పాటు చేశారు. వీటిని హైస్కూల్ హెచ్ఎం ఎం.కూర్మారావు అధ్యక్షతన అందజేశారు. విద్యార్థులకు ఉన్న 80 రోజుల సమయాన్ని ఈ మెటీరియల్‌తో సద్వినియోగం చేసుకోవాలని దాతలు పిలుపునిచ్చారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల హెచ్ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ జాన్‌ప్రసాద్, ఆర్వీ రమణమూర్తి, సీహెచ్‌వీవీ కృష్ణమూర్తి, సీహెచ్ నాగరాజు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన నేత మన్మోహన్‌సింగ్



పిఠాపురంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: ప్రపంచం మెచ్చిన నేత మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ జీవితం రాబోయే తరాలకు ఒక విలువైన పాఠంగా నిలుస్తుందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, రాజకీయాల్లో అగ్రగణ్యుడు మన్మోహన్‌సింగ్ కొనియాడారు. ఆయన కృషితో ప్రపంచస్థాయిలో మన దేశానికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించాయన్నారు. దేశ ప్రజల తలరాతలు మార్చేలా ఎన్నో విప్లవాత్మకమైన పథకాలు, కార్యక్రమాలను తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్‌ను కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, వెంటేశ్వరరావు, మాధవరావు, మత్స వెంకతాతాజీ, బత్తిన సాయి, గింజల శ్రీను, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి



దుర్గాడలో ప్రసంగిస్తున్న కమలానంద సరస్వతీస్వామి

పిఠాపురం: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కేసరపల్లి భువనేశ్వరి కమలానంద సరస్వతీస్వామి పిలుపునిచ్చారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగంతం పలికారు. శివాలయం విశిష్టతను వివరించారు. హిందూ సంస్కృతి, హైందవ ధర్మం ప్రాధాన్యంపై స్వామీజీ ప్రసంగించారు. దేవాలయాల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్వామీజీ కోరారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ సభ్యులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరూ ఆత్మీయ బంధువులే

కొత్తపల్లి: ప్రపంచంలోని ప్రతి జీవి, ప్రతి మనిషి హిందువులకు ఆత్మీయ బంధువులే అని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుడు శివరామకృష్ణయ్య అన్నారు. పిఠాపురంలోని సూర్యరాయ గ్రంథాలయ భవనంలో శనివారం జిల్లా సహాయ కన్వీనర్ కంబాల నారాయణరావు అధ్యక్షన జిల్లా సమావేశం న్విహించారు. హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ పడాల రఘు, జిల్లా పరియోజన సహాయ ప్రముఖ్ చత్రపతి శివాజీ, జిల్లా మహిళా సహాయ కన్వీనర్ వాసంశెట్టి సూర్యవతి, ఖండ ధర్మ ప్రచారకులు, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రియ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కాకినాడలో బహుమతులు అందుకుంటున్న వాకతిప్ప హైస్కూల్ విద్యార్థులు

కొత్తపల్లి: కాకినాడలో శనివారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి క్రియ పోటీల్లో వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. సైన్స్ ప్రయోగంలో 7వ తరగతి విద్యార్థి డి.సత్యనారాయణ, 6వ తరగతి విద్యార్థి జి.దేవహర్ష ద్వితీయ స్థానం సాధించారు. 8వ తరగతి విద్యార్థులు జోసెఫ్, చైతన్య కన్సోలేషన్ బహుమతులు పొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, గైడ్ సతీష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

తొలి తిరుపతిలో భక్తుల సందడి

పెద్దాపురం: మార్గశిర మాసం.. అమావాస్య ముందు వచ్చిన శని త్రయోదశి పర్వదినం కావడంతో మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాల రూపంలో స్వామి వారికి రూ.1,70,119 ఆదాయం సమకూరిందని వివరించారు. రెండు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామన్నారు.



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

31లోపు అభ్యంతరాలు తెలియజేయాలి

సామర్లకోట: మండల పరిధిలో షెడ్యూల్ కులాలకు సంబంధించిన వారి సర్వేను ప్రభుత్వ జీఓ ప్రకారం పూర్తి చేసి మండల పరిధిలోని ఆయా సచివాలయాల్లో ఉంచినట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి శనివారం తెలిపారు. ఆయా జాబితాలను పరిశీలించి ఈ నెల 31లోపు సచివాలయాలలోని వీఆర్వోలకు తెలియజేయాలన్నారు. అభ్యంతరాలను సరి చేసి తుది జాబితా జనవరి పదో తేదీన ప్రచురించనున్నట్టు తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన వారి సర్వే నివేదికలు సచివాలయాలోని రెవెన్యూ అధికారుల వద్ద ఉన్నాయని తెలిపారు. అభ్యంతరాలు రాక పోతే తుది జాబితా ప్రచురించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తుది జాబితా తయారు చేసిన తరువాత మార్పులకు అవకాశం ఉండదని ఎస్సీ కులాల వారు ఈ సర్వే రిపోర్టులను గమనించాలన్నారు.

ఆకతాయిలతో అప్రమత్తం



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సీఐ ఎ.కృష్ణభగవాన్ అవగాహన సదస్సులో పాల్గొని బాలికలు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేడు సైబర్ నేరాలు ఎక్కువగా పెరిగిపోయాయని, వాటిపై అవగాహన లేని తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కలిగించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఆయన అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాల ఆట స్థలంలో ఒక గంట ఆటలకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. పాఠశాల హెచ్ఎం యు మీనామాధురి అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పిఠాపురంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ అన్నారు. పిఠాపురం పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద శనివారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఓటీపీ చెప్పండి అని ఎవరైనా అడిగితే చెప్పవద్దన్నారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని సూచించారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఠాపురం పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

కొత్తపల్లి: విద్యార్థిని అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. చేబ్రోలు గ్రామానికి చెందిన ఒక బాలిక శుక్రవారం ఉదయం పిఠాపురం కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారపురంలో వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి: పిఠాపురం మండలం కుమారపురం గ్రామానికి చెందిన కటారి బాబ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాబ్జికు వివాహమై ఎనిమిది సంవత్సరాలు అయ్యింది. పిల్లల పుట్టకపోవడంతో భార్య నాగు తరచూ అమ్మగారింటికి వెళ్లిపోతోంది. బాబ్జి కూలి పని చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. భార్య తరచూ పుట్టింటికి వెళ్లిపోవడంతో ఈ నెల 26వ తేదీ రాత్రి బాబ్జి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమారపురం గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న నూతిలోకి దూకి బాబ్జి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికుల సహాయంతో పోలీసులు గుర్తించారు. పిఠాపురం రూరల్ పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు వంగా గీత పరామర్శ



కొత్తపల్లిలో వెలుగుల వరప్రసాద్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను శనివారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత పరామర్శించారు. మండలంలోని మూలపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కంబాల లక్ష్మణరావు పెదనాన్న, మాజీ సర్పంచ్ కంబాల కనకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే కొత్తపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయుడు వెలుగుల వరప్రసాద్ తండ్రి వెలుగుల బుల్లిఅప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయా కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్థానిక పాత్రికేయుడు మామిడాల చక్రధర్‌రావు ప్రథమ చికిత్స చేయించుకోవడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఉమ్మిడి జాన్, జ్యోతులు బాబులు, గింజల శ్రీను, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్‌పురంలో రెవెన్యూ సదస్సు



హుస్సేన్‌పురంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్ర శేఖరరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలో హుస్సేన్‌పురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు వారి నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల ప్రాధాన్యం బట్టి 15 నుంచి 20 రోజుల్లో సమస్యలు పరిష్కారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మజా రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, గ్రామ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు, తలారి పోతురాజు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలో పర్యటించి గ్రామ ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించాలి

- మెప్మా సిటీ మిషన్ మేనేజరు హుస్సేన్



సామర్లకోట స్టేట్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్

సామర్లకోట: స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న వస్తువులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని మెప్మా సిటీ మిషన్ మేనేజరు హుస్సేన్ అన్నారు. శనివారం స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద పెద్దాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన అర్బన్ స్వయం సహాయక సంఘాల మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా ప్రోత్సహించడానికి బయట మార్కెట్‌లో కొనుగోలు చేసే వస్తువులను వారి వద్ద కొనుగోలు చేయాలని సూచించారు. వస్తువుల నాణ్యతను పరిశీలించడానికి ఈ మెప్మా బజారును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళలు తయారు చేసిన కుట్టుకు సంబంధించిన అల్లికల వస్తువులు, తినుబండారాలు, డ్రై ఫ్రూట్స్, పిల్లల ఆట వస్తువులు ఉన్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా భవితకు పునాది



నిరుద్యోగ యవతకు సూచనలు ఇస్తున్న కొండరావు

సామర్లకోట: జాబ్‌మేళా యువత భవితకు పునాది అని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.కొండలరావు, సిడాప్ మేనేజరు కిరణ్ అన్నారు. స్థానిక టీటీడీసీలో నిర్వహించిన జాబ్‌మేళాలో వారు పాల్గొని నిరుద్యోగ యువతకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాబ్‌మేళాలో ఎటువంటి అనుభవం లేకుండా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో పొందిన ఉద్యోగాల ద్వారా అనుభవం సంపాదించి, దాంతో మంచి కంపెనీలో ఉద్యోగాలు సంపాదించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏపీత్రోయ ఫార్మా కంపెనీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, బ్లూఓషన్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 60 మంది హాజరు కాగా 18 మందిని ఎంపిక చేసినట్లు జాబ్స్ కో ఆర్డినేటర్ శివ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

కొత్తపల్లి: పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలో శనివారం మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. మేడపాటి రాజకుమార్, వసంత కుమార్ (అన్నదమ్ములు) పెదపూడి నుంచి మోటార్ సైకిల్‌పై జల్లూరు మీదుగా పిఠాపురం మండలం భోగాపురంలో బంధువుల ఇంటికి వస్తున్నారు. ఎఫ్‌కే పాలెం వద్ద పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్తున్న కారు ఢీకొట్టడంతో వీరిద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి వెండి పళ్లెం సమర్పణ



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామికి వెండి పళ్లెం, ఉద్ధరిణి సమర్పిస్తున్న భక్తులు

కొత్తపల్లి: గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌కు సమీపంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం దాత వెండి పళ్లెం, ఉద్ధరిని సమర్పించారు. దాత జయవరపు మురళీకృష్ణ, సత్యకుమారి దంపతులు 500 గ్రాముల వెండి పళ్లెం, ఉద్ధరిణి ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.